శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, ఆగస్టు 31, ప్రభాతవార్త** : మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం సాయంత్రానికి 23496 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 61.660 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 250, ఎన్ఎఫ్‌సికి 400, పెన్నా డెల్టాకు 500, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 98.265మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# వీఆర్ హైస్కూల్ ఓ అద్భుతం.. రాష్ట్రం సలహాదారు సతీష్ రెడ్డి హర్షం

- మంత్రి నారాయణ, కలెక్టర్ ఆనంద్‌తో కలిసి వీఆర్‌ని సందర్శించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్ర సతీష్‌రెడ్డి
- మంత్రి నారాయణ ప్రత్యేక కృషితోనే వీఆర్ హైస్కూల్‌కు పూర్వ వైభవం



**నెల్లూరు, ఆగష్టు 31, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో వీఆర్ హైస్కూల్లో చూస్తే అద్భుతంగా ఉందని రాష్ట్రం ప్రభుత్వ సలహాదారు జాతీయ భద్రతా సలహా మండలి సభ్యులు గుండ్ర సతీష్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు నగరంలోని వీఆర్ హైస్కూల్‌ను రాష్ట్రం పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, కలెక్టర్ ఆనంద్ కలిసి ఆయన హైస్కూల్‌ని సందర్శించారు. మంత్రి నారాయణ ఎంతో అద్భుతంగా వీఆర్ హైస్కూల్‌ను రూపురేఖలు మార్చేశారని తెలిపారు. పాఠశాలను చూసి ఇంతలా ఉంటుందని ఊహించలేదన్నారు. కార్పొరేట్ వసతులతో పేద విద్యార్థులకు డిజిటల్ విద్యను బోధిస్తున్నట్లు వారు తెలిపారు. ఇక్కడ చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులకు మంత్రి నారాయణ దత్తత తీసుకోవడం ఎంతో మందికి స్ఫూర్తి దాయకమని తెలిపారు. మంత్రి ఒక విజన్ ఉన్న నాయకుడన్నారు. మంత్రి నారాయణ స్ఫూర్తితో దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చిన్నారులను దత్తత తీసుకోవాలని తెలిపారు. వీఆర్ హైస్కూల్ అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. మంత్రి నారాయణ ప్రత్యేక కృషితోనే వీఆర్ హైస్కూల్‌కు పూర్వ వైభవం వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమీషనర్ నందన్, డీఈఓ బాలాజీరావు, వీఆర్ హైస్కూల్ హెడ్ మాస్టర్ వెంకట్రావు, సిబ్బంది, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి పాల్గొన్నారు.

# ఒక్కొక్కరుగా కటాకటాల్లోకి..

- ఎక్కడికక్కడ రౌడీషీటర్ల అరెస్ట్
- అన్ని పార్టీల్లోనూ అరుణ సన్నిహితులు
- అధికార పార్టీకి అంటుకున్న గంజాయి మరక



**నెల్లూరు క్రైం, ఆగష్టు 31, ప్రభాతవార్త :** ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం నెల్లూరు నగరం పై ప్రత్యేక దృష్టి పెట్టడం, రాష్ట్ర పోలీస్ బాస్ స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో నగరంలో యాక్టివ్‌గా ఉంటూ పలు రాజకీయ పార్టీల పంచన చేరి దందాలు రౌడీయిజాలు చేస్తున్న రౌడీ షీటర్లను ఏరి వేసే పనిలో పడ్డారు జిల్లా పోలీసులు. నిడిగుంట అరుణ అరాచకాలు వెలుగు చూసిన నేపథ్యంలో, ఖైదీ శ్రీకాంత్ సహచరులుగా నెల్లూరులో గతకొన్నేళ్లగా రౌడీయిజం చేస్తున్న నిందితులను ఎక్కడికి అక్కడ పట్టుకుంటూ, చాలా రోజుల తర్వాత పోలీసు మార్కు ట్రీట్మెంట్ ఇచ్చి కటకటాల్లోకి పోలీసులు పంపిస్తున్నారు. ఇప్పటికే 14 మందికి పైగా రౌడీషీటర్లను అదుపులోకి తీసుకొని జైలుకు పంపించడం జరిగింది. అయితే పోలీసుల చేతికి చిక్కుతున్న రౌడీషీటర్లలో అధికార పార్టీకి చెందిన వారు కూడా ఉంటుండడంతో ఒత్తిళ్లు ఎదుర్కోవాల్సి వస్తోంది. అయితే డీజీపీ ఎవరి మాట వినొద్దని, తమ వారంటూ ఎవరు ఫోన్లు చేసిన ఒత్తిళ్లు తీసుకొచ్చినా ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టడానికి వీల్లేదంటూ ఆదేశించడంతో పోలీసులు కొన్ని సందర్భాల్లో మధ్య మార్గాన్ని ఎంచుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇటీవల నెల్లూరు వెంకటేశ్వరపురం ప్రాంతానికి చెందిన నలుగురు వ్యక్తులను బిట్రగుంట పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుండి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ఇద్దరు గతంలో ఏపీఎస్పీ పోలీస్ కానిస్టేబుళ్లగా పనిచేస్తూ చేయకూడని పనులు చేయడంతో విధుల నుంచి తొలగించబడ్డారు. అప్పటినుంచి ఆ ఇద్దరు, నిడిగుంట అరుణ వెంట తిరుగుతూ ఆమె చెప్పే పనులు చేస్తూ అరాచకాలకు పాల్పడటం అలవాటుగా చేసుకున్నారు. వారితోపాటు అధికార పార్టీ యువజన విభాగంలో ముఖ్యమైన నేతగా ఉన్న మరో రౌడీషీటర్, అతని అనుచరుడు కలిసి దందాలు చేసేవారని పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. బిట్రగుంట పోలీసులు పట్టుకున్న వారిలో ఒకరు వెంకటేశ్వరపురం ప్రాంతంలో భారీ భవంతి నిర్మిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అంత పెద్ద భవంతిని నిర్మించడం వెనక గంజాయి విక్రయాలు కారణమనే కోణంలో కూడా విచారణ చేస్తున్నారు. నెల్లూరులో తరచూ నేరాలకు పాల్పడే ఇలాంటి వారిని బిట్రగుంట స్టేషన్లో గంజాయి కేసులో అదుపులోకి తీసుకోవడం వెనక అధికార పార్టీ ఒత్తిడి బలంగా పని చేసిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక అధికార పార్టీ నాయకుడు పోలీసుల అదుపులోకి తీసుకున్న నలుగురు నిందితుల్లో కొందరిని తన పంచన చేర్చుకుని, వారి దందాలకు అధికారుల రూపంలో అడ్డు తగలకుండా చూసుకోవడం, తన అవసరాలకు వారిని ఉపయోగించుకోవడం చేస్తూ వచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కసారిగా టిడిపి అధినాయకత్వం నెల్లూరు నగరంలో రౌడీ షీటర్ల ఆగడాలపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పోలీసులు రౌడీ షీటర్‌గా నమోదై, పద్ధతి మార్చుకోకుండా రౌడీయిజానికి, అరాచకాలకు పాల్పడుతున్న వారిని ఒక్కొక్కరిగా కటకటాల వెనక్కి పంపించే ప్రయత్నానికి నాంది పలికారు. ఈ క్రమంలోనే వెంకటేశ్వరపురం ప్రాంతానికి చెందిన వారిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అయితే వారందరిని బిట్రగుంట స్టేషన్లో అరెస్టు చూపించడం వెనక పార్టీకి ఎటువంటి నష్టం జరగకుండా చూడడమేనన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే రౌడీషీటర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయడం పై రాష్ట్ర నాయకత్వంతో పాటు జిల్లా అధికార పార్టీ నాయకులు కూడా స్పష్టతతో ఉండడంతో పోలీసుల పని కాస్త సులువుగా ఉంటోంది. వ్యక్తుల క్రిమినల్ రికార్డ్స్ పరిశీలించకుండా రౌడీ షీటర్లకు పార్టీ సభ్యత్వం ఇవ్వడం పట్ల అధికార పార్టీ జిల్లా నాయకత్వంలోను భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నట్లు సమాచారం.

# రైతుల విషయంలో ప్రత్యేక శ్రద్ధతో కూటమి ప్రభుత్వం

- కోడూరు చెరువు పై భాగంలో ఐదేళ్ల తర్వాత సాగులోకి 1500 ఎకరాలు
- వైసీపీ ఐదేళ్ల పాలనలో పంట పెట్టుకోలేకపోయిన ఆ రైతులు
- ఆయకట్టు రైతులకే మొదటి ప్రాధాన్యం
- తోటపల్లిగూడూరు మండలం కోడూరు చెరువు పైభాగంలో సన్నకారు రైతులు సాగు చేసిన పొలాలను పరిశీలించిన సందర్భంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి
- ఐదేళ్ల తర్వాత మళ్లీ పంట పండించుకునే అవకాశం లభించిందని ఆనందం వ్యక్తం చేసిన రైతులు
- మీడియాతో సోమిరెడ్డి కామెంట్స్





**తోటపల్లిగూడూరు, ఆగష్టు 31, ప్రభాతవార్త** రైతుల విషయంలో ప్రత్యేక శ్రద్ధతో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. తోటపల్లిగూడూరు మండలం కోడూరు చెరువు పైభాగంలో సన్నకారు రైతులు సాగు చేసిన పొలాలను పరిశీలించిన సందర్భంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడారు. కోడూరు చెరువు పై భాగంలో సాగు చేసిన పైర్లు చూసి ఆనందంగా ఉందన్నారు. పెన్నార్ డెల్టాలో భాగమైన ప్రాంతంలో కాలువల ఆధారంగా పంటలు సాగు చేస్తాం అన్నారు. ఎన్టీఆర్ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పుణ్యాన మనకు 78 టీఎంసీల సామర్థ్యమున్న సోమశిల జలాశయం ఉంది. 4700 ఎకరాలు ఆయకట్టు కోడూరు చెరువు కింద సాగువుతోంది. చెరువు పై భాగంలో 1500 ఎకరాలను కోడూరు, ఈదూరు, విలుకానిపల్లి, మాచర్లవారిపాలెం, ఆములూరు రైతులు సాగు చేసుకుంటారు. ఆయకట్టు రైతులకు ఇబ్బంది లేకుండా ఇక్కడ పంట పెట్టుకుంటారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ చెరువు నిండా నీళ్లు పెట్టి 1500 ఎకరాల్లో పంట లేకుండా చేశారు. ఆయకట్టు సాగుకు ఎంత నీరు అవసరమో అంత నీరు నిల్వ చేసుకుంటే ఇబ్బంది లేదన్నారు. అవసరాలకు మించి నింపారన్నారు. కాలువల ఆధారంగా పంటలు సాగు చేసే మనకు ఎప్పుడు కావాలంటే అప్పుడు నీరు విడుదల చేస్తారన్నారు. ఎకరా, అరెకరా సాగు చేసుకునే సన్న కారు రైతులు ఏడాది ఒక పంట కూడా పెట్టుకునే పరిస్థితి లేకుండా చేయడం బాధాకరమన్నారు. 1500 ఎకరాల్లో 6 వేల పుట్ల దిగుబడి కోల్పోయారు. 6 వేల పుట్ల అంటే రూ.10 కోట్ల రాబడి, రూ.6 కోట్ల వరకు ఆదాయం లేకుండా పోయింది. ఐదేళ్లపాటు సుమారు రూ.30 కోట్ల ఆదాయాన్ని రైతులు నష్టపోయారు. ప్రజల ప్రయోజనాల కోసం పని చేయాల్సిన ప్రభుత్వాలు ఇలాంటి పరిస్థితి తేవడం బాధాకరం. కోడూరు కాలువ సిస్టమ్ ను బాగు చేయడానికి గతంలోనే నేను రూ.9కోట్లు మంజూరు చేయించాను. అప్పట్లో ఉమ్మడి ఏపీ మంత్రులుగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు, కడియం శ్రీహరి, మండవ వెంకటేశ్వరరావును తీసుకొచ్చి కోడూరు చెరువుతో పాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించుకున్నాం అన్నారు. చెరువు కట్టను ఎంతో పటిష్టంగా తీర్చిదిద్దాం అన్నారు. వైసీపీ పాలనలో మట్టి వ్యాపారం కోసం చెరువును గుంతలమయంగా మార్చారు అన్నారు. కట్టను బలహీనంగా చేసేశారన్నారు. ఆయకట్టు రైతులు మొదటి ప్రాధాన్యం, ఒక ఎకరా కూడా ఆయకట్టులో ఎండకూడదు అన్నారు. అదే సమయంలో అనవసరంగా నీటిని నిల్వ చేసి ఎగువ రైతులను ఇబ్బంది పెట్టడం కూడా సరికాదన్నారు. 1500 ఎకరాలను ఐదేళ్లు ఎండబెట్టిన వాళ్లకు ఏమొచ్చింది. మానవత్వం లేకుండా ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేయడమెందుకు అన్నారు. ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే వందల కోట్ల విలువైన భూముల రికార్డులను మార్చేశారన్నారు. ఆయకట్టు రైతులకు ఇబ్బంది లేకుండా ఎగువ ప్రాంతంలోని రైతులు ఒక్క పంట పండించేందుకు కట్టుబడి ఉన్నాం అన్నారు. రైతుల విషయంలో మా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో ముందుకు సాగుతోందన్నారు. అదృష్టవశాత్తు సోమశిల జలాశయంలో నీటి నిల్వ 62 టీఎంసీలు దాటింది. కండలేరులోనూ 36 టీఎంసీలు ఉన్నాయి. రాబోయే సీజన్‌లో 7 లక్షల ఎకరాల్లో పంట పండించుకునే అవకాశం లభించింది.

## సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే




**వింజమూరు, ఆగష్టు 31, ప్రభాతవార్త** ఉదయగిరి నియోజకవర్గంలోని సీతారాంపురం, ఉదయగిరి, వరికుంటపాడు, వింజమూరు, కలిగిరి, కొండాపురం, జలదంకి మండలాలకు సంబంధించిన 39 మంది బాధితులకు సుమారు 50 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పంపిణీ చేశారు. వింజమూరులోని తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయం నందు ఆయా మండల నాయకులతో కలిసి ఆదివారం బాధితులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ వైద్యశాలలో వైద్యం చేయించుకొని ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా వైద్యం అందని వారికి సీఎం సహాయనిధి నుండి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా ప్రభుత్వం అందిస్తుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారు. మన ప్రభుత్వం మంచి ప్రభుత్వం అని ప్రభుత్వానికి అందరం అండగా ఉండాలన్నారు. ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం శ్రమిస్తున్నానని మీరందరూ తోడ్పాటును అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, సీహెచ్ బయన్న, మధు మోహన్‌రెడ్డి, బిజ్జం వెంకట కృష్ణారెడ్డి, వింజమూరు సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, మండల ఉపాధ్యక్షుడు ఆనంగి రమణయ్య, గువ్వల కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు పోలుబోయిన చంద్రబాబునాయుడు, యారవ కృష్ణయ్య, సర్పంచ్ పీవీ నాయుడు, బొల్లినేని వెంకట రామారావు, మందాల శ్రీనివాసులు నాయుడు, కోడూరు నాగిరెడ్డి, గాలి రామ్మోహన్‌నాయుడు, గాలి నర్సప్పనాయుడు, సీహెచ్ వసంతరావు, తిరుపతి ఆచారి, బొజ్జ నరసింహులు, నల్లిపోగు రాజా, ఏగినేని శ్రీనివాసులు నాయుడు తదితరులు ఉన్నారు.

## మాజీ ఉపరాష్ట్రపతిని కలిసిన అంకినపల్లి



**వింజమూరు, ఆగష్టు 31, ప్రభాతవార్త** మాజీ ఎఫ్సీఐ డైరక్టర్ అంకినపల్లి ఓబుల్‌రెడ్డి ఆదివారం మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడును నెల్లూరులోని స్వర్ణ భారతి ట్రస్టులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అంకినపల్లి ఓబుల్‌రెడ్డి వింజమూరు మండలంలోని నల్లగొండ గ్రామంలో నీలగిరి పర్వతంప వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులు ఆలయ ప్రాచుర్యం వెంకయ్య నాయుడుకు వివరించారు. అలాగే ఆలయ అభివృద్ధికి అవసరమైన పనులు తెలియజేశారు. ఆలయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరుకు మీ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఉపరాష్ట్రపతిని కలిసిన బత్తల కృష్ణయ్య



**చేజర్ల ఆగష్టు 31 ప్రభాతవార్త** మాజీ ఉపరాష్ట్రతి ముప్పవరపు వెంకయ్యనాయుడు వెంకటాచలం స్వర్ణభారత్ ట్రస్టు కు విచ్చేయడంతో బిజెపి జిల్లా ఉపాధ్యాక్షులు బత్తల కృష్ణయ్య మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వినాయకచవితి పురస్కరించుకొని విచ్చేసిన సందర్భంగా ఆయనకు పూల బొక్కేను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట మండల బిజెపినాయకులు ఉన్నారు.

## క్రీడల పట్ల ప్రతి ఒక్కరు ఆసక్తిని చూపాలి



**కావలి, ఆగస్టు 31, ప్రభాతవార్త :** క్రీడల పట్ల ప్రతి ఒక్కరు ఆసక్తిని చూపి మంచి క్రీడాకారులుగా ఎదగాలని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి కోరారు కావలి పట్టణం 16వ వార్డు లోని చంద్రబాబు కాలనీ లో వర్ష ఉడ్ బాడ్మింటన్ కోర్టును కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆదివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్య దగుమాటి పాల్గొన్నారు. క్రీడాకారులతో సరదాగా కాసేపు షటిల్ బాడ్మింటన్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు.. సౌకర్యవంతంగా, అన్ని వసతులతో ఏర్పాటు చేసిన బ్యాట్మెంటన్ కోర్టు యాజమాన్యం ను ఆయన ప్రత్యేకంగా అభినందించి మాట్లాడారు క్రీడాకారులందరూ క్రీడా స్ఫూర్తితో క్రీడలను ఆడాలని, గెలుపు ఓటమిలు సహజమని పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ లేదు అన్నారు... ఈ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్టు మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబు టిడిపి నాయకులు, దేవరకొండ శ్రీనివాసులు మరియు కూటమి సభ్యులు పాల్గొన్నారు

## విద్యుత్ శాఖ నిర్లక్ష్యం మరో వ్యక్తి బలి



**ఇందుకూరుపేట, ఆగష్టు 31, ప్రభాతవార్త** ఇందుకూరుపేట మండలంలోని శెట్టివారి కండ్రిగలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి నట్రంబాక వెంకటేశ్వర్లు అనే రైతుల బలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పొలంలో వరికోత కోసేందుకు సిద్ధం చేసుకునే సమయంలో వెంకటేశ్వర్లు పంట పొలంలో స్తంభం నుండి విద్యుత్ వైర్లు పొలంలో తెగి పడి ఉండడం వల్ల కరెంటు షాక్‌తో మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వలనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ వారంలో ఇది రెండవ సంఘటన ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు మండల విద్యుత్ శాఖ సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## గణేష్ నిమజ్జనోత్సవంలో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి



**నెల్లూరు, ఆగష్టు 31, ప్రభాతవార్త-వైద్యం :** నెల్లూరు శ్రీ ఇరుకళల పరమేశ్వరి తల్లి దేవస్థానం ఆవరణలో గణేష్ ఘాట్ వద్ద నిమజ్జనోత్సవంలో ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, ఉషమ్మ దంపతులతో పాటు దీపా వెంకట్ తో కలసి పాల్గొన్న సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మొదట శ్రీ స్వర్ణలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు.

## మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుతో భేటీ అయిన ఎమ్మెల్యే సోమిరెడ్డి



**నెల్లూరు, ఆగష్టు 31, ప్రభాతవార్త-వైద్యం :** వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టు ప్రాంగణంలో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడుతో భేటీ అయిన శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వెంకయ్య నాయుడి యోగక్షేమాలు తెలుసుకోవడంతో పాటు సర్వేపల్లి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ఇంకా చేయాల్సిన అంశాలపై చర్చించిన సోమిరెడ్డి.

## శ్రీఅభయాంజనేయస్వామి సన్నిధిలో అన్నదానం



**వింజమూరు, ఆగష్టు 31, ప్రభాతవార్త :** వింజమూరులోని పాతూరు నందు వేంచేసియున్న శ్రీ అభయాంజనేయస్వామి వారి సన్నిధిలో శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆశీస్సులతో అన్నదానం నిర్వహించారు. వినాయక చవితి పర్వదినాన్ని పురుష్కరించుకుని 23 సంవత్సరాలుగా గణేష్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు గణేష్ ఉత్సవ నిర్వహణ కమిటీ తెలిపింది. గత నాలుగు రోజులుగా పూజలందుకున్న గణేశుడు నిమజ్జన సందర్భంగా ఈ అన్నదానాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. స్వామివారికి ప్రతి రోజు దూపదీప నైవేద్యాలను సమర్పిస్తూ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి అనుగ్రహంతో ప్రజల కష్టాలు తొలగి ఆయురారోగ్య ఐశ్వర్యాలు సిద్ధింపచేయాలని భక్తులు బనసారా కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ నిర్వాహకులు పర్యవేక్షించారు.

## ఆంధ్ర రాష్ట్ర బ్రాహ్మణ చైర్మన్ను కలిసిన సేవా సంఘ సమితి నాయకులు



**విడవలూరు, ఆగష్టు 31, ప్రభాతవార్త :** ఆదివారం విజయవాడలో ఆంధ్ర రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, బుచ్చి గ్రామానికి చెందిన రాంప్రసాద్‌ని మర్యాదపూర్వకంగా నెల్లూరు జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి నాయకులు కలవడం జరిగింది. వారితో మాట్లాడుతూ బ్రాహ్మణ సమస్యల గురించి చర్చించడం జరిగింది. గరుడ స్కీమ్‌ను పునర్దించుట గురించి పెన్షన్లు తీసివేసిన వాటిని పునర్దించాలని చర్చించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ రాంప్రసాద్ స్పందించి మాట్లాడుతూ బ్రాహ్మణ సంబంధించిన విషయాలలో ఎటువంటి సమస్యలు ఉన్న వాటిని తన దృష్టికి తీసుకొస్తే అధికార యంత్రాంగం దృష్టికి తీసుకువెళ్లి వాటిని సానుకూలంగా పరిష్కారించెందుకు కృషి చేస్తానని ఆయన తెలియజేశారు. కూటమి ప్రభుత్వంలో అన్ని విధాలుగా ప్రజలకు సేవలు అందించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుడ్లదొన వాసుదేవరావు, కద్దుకూరు రమేష్, కోశాధికారి, రామాయణం మణికుమార్, అర్చక సమైక్య ప్రధాన కార్యదర్శి శేషాచార్యులు, ఆది శైవ అర్చక సంఘం, ప్రధాన కార్యదర్శి గుడ్లూరు ఫణి కుమార్ శర్మ, పిఈ రేపి శ్రీనివాస్ శర్మ, జీవి సుబ్రహ్మణ్య శర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పాతాళపల్లిలో వినాయకచవితి ఉత్సవాలు



**అనంతసాగరం, ఆగష్టు31, ప్రభాతవార్త :** మండలంలోని పాతాళపల్లిలో వినాయకచవితి ఉత్స వాలు ఐదురోజులు వైసిపి మండల కన్వీనర్ బిజివేముల పిచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, ముగ్గులపోటీలు నిర్వహించారు. ఆదివారం గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం ఉట్టి మహోత్సవం నిర్వహించి అనంతరం వినాయకుని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం అనంతసాగరం చెరువులో నిమజ్జనం చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధ్యాయునికి నివాళులర్పించిన విద్యాశాఖ అధికారులు



**ఉదయగిరి, ఆగష్టు 31, ప్రభాతవార్త :** ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నల్లబోతుల వెంకట రమణ(45) చెన్నై అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గత రాత్రి మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామమైన దుత్తలూరు మండలం నందిపాడుకు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న ఉదయగిరి ఎంఈఓలు తోట శ్రీనివాసులు, టి.వెంకటేశ్వర్లు పాఠశాల సహచర ఉపాధ్యాయ సిబ్బంది ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు.

## ఉదయగిరిలో సీతారాంపురం జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్సు కారు ఢీ



**ఉదయగిరి, ఆగష్టు 31, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి సీతారాంపురం జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్సును వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. సీతారాంపురం నుండి ఉదయగిరికి వస్తున్న ఆర్టీసీ బస్సును నందిపాడు నుండి నేలటూరుకు వెళ్తున్న కారు బస్సును ఢీకొట్టడంతో కారు ముందు ఇంజన్ భాగంగా పూర్తిగా నుజ్జు నుజ్జు అయ్యి కారులోని ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ అయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి దర్యాప్తు చేపట్టారు.

### ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కి కృతజ్ఞతలు తెలిపిన కొట్టాయపల్లి సొసైటీ చైర్మన్, డైరక్టర్లు




**ఉదయగిరి, ఆగష్టు 31, ప్రభాతవార్త :** ఉదయగిరి మండలం కొట్టాయపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులుగా గడ్డం వెంకటేశ్వర్లు నూతనంగా ఎంపికయ్యారు. ఆ పదవి రావడానికి సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కి కృతజ్ఞతలు తెలిపేందుకు ఆదివారం నాడు వింజమూరులోని తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ని శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట సొసైటీ డైరక్టర్లుగా ఎంపికైన బొజ్జ నరసింహులు నల్లిపోగు రాజా ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బయన్న, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ఉదయగిరి జిల్లా చేసేందుకు మద్దతు ఇవ్వండి

### - భారత పూర్వ ఉపరాష్ట్రపతిని కోరిన ఉద్యమ నాయకులు



**ఉదయగిరి, ఆగష్టు 31, ప్రభాత వార్త :** రాష్ట్రంలోనే వెనుకబడి ఉన్న ఉదయగిరి పరిసర మెట్ట మండలాలను కలిపి ఉదయగిరి జిల్లా చేయాలని భారత పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడును ఉద్యమ నాయకులు ఆదివా రం వెంకటాచలంలోని స్వర్ణ భారతి ట్రస్టులో కలిసి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల, డివిజన్ల, మండలాల పునర్వ్యవస్థీకరణ కోసం మంత్రి వర్గ ఉప సంఘాన్ని నియమించి ప్రజాభిప్రాయం సేకరిస్తున్న సందర్భంగా ఉదయ గిరి జిల్లా సాధన కమిటీ నాయకులు ఆయనను కలిశారు. ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులుగా రెండు పర్యాయాలు ప్రాతినిధ్యం వహించి, ఇక్కడి స్థితిగతులన్నీ అవగాహన ఉన్నందున ఉదయగిరి జిల్లాగా ఏర్పాటు చేసేందుకు మద్దతు ఇవ్వాలని వారు వెంకయ్య నాయుడును కోరారు. గత ప్రభుత్వం వద్ద ఉదయగిరి జిల్లా ప్రతిపాదనలు చేస్తే ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గంలోని 8 మండలాలను మూడు ముక్కలుగా చేసి కావలి కందుకూరు, ఆత్మకూరు, రెవెన్యూ డివిజన్లలో కలిపిందని తెలిపారు. అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధి బాట పట్టాలంటే జిల్లా చేయడం ఒక్కటే మార్గమని వారు వెల్లడించారు. పూర్వ ఉప రాష్ట్రపతిని కలిసిన వారిలో ఉదయగిరి మాజీ శాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎలోసి రమణారెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ బీజేపీ నాయకులు ఎం.బాలకృష్ణరెడ్డి, ఉదయగిరి జిల్లా సాధన కమిటీ నాయకులు ఎండీ ఖాజా, పాముల రమణయ్య తదితరులు ఉన్నారు.

## ఉదయగిరిలో సీపీఎం 5వ మహాసభ



**ఉదయగిరి, ఆగష్టు 31, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనం నందు సీపీఎం 5వ మహాసభ వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలకార్యదర్శి కాకు వెంటయ్య నివేదికను ప్రవేశపెట్టారు. ఈ నివేదికలో ఐదు మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిధిగా వచ్చిన పులిగండ్ల శ్రీరాములు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతాంగం నాశనం అవుతుందని అన్నారు. విధి విధానాలకు పోరాటం వ్యతిరేకంగా చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీని 9 మందితో ఎన్నుకున్నారు. అధ్యక్షులు వెంకటేశ్వర్లు, కార్యదర్శి కాకు వెంకటయ్య ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోడే రమణయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మాజీ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బోగినేని చెంచు రామానాయుడుని అరెస్టు చేయాలి

### - మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు దాసరి శివాజి డిమాండ్



**ఉలవపాడు, ఆగష్టు 31, ప్రభాతవార్త :** లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఐఏఎస్ అధికారి విజయ్ కుమార్‌పై ఫేస్‌బుక్‌లో అనుచిత, వ్యక్తిగత దూషణలు చేసిన ఉలవపాడుకి చెందిన ఎన్ఆర్ బోగినేని చెంచు రామానాయుడు పై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు దాసరి శివాజీ డిమాండ్ చేశారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా, రాష్ట్రంలో ఎన్నో అత్యున్నత స్థాయిలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సమర్థవంతంగా నిజాయితీగా తన వృత్తి ధర్మాన్ని కొనసాగించినటువంటి వ్యక్తి విజయ్ కుమార్ అని, అలాంటి వ్యక్తి మీద, అగ్రకుల అహంకారంతో డబ్బు, మదంతో ఎక్కడో పక్క దేశాల్లో ఉంటూ, ఒక నిజాయితీ పరుడైన మాజీ ఐఏఎస్ అధికారిపై వ్యంగ్యంగా అవమానకరంగా హేళనగా, దుర్భాషలాడిన బోగినేని చెంచు రామానాయుడుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు దాసరి శివాజి డిమాండ్ చేశారు.

## మట్టి వినాయకుని నిమజ్జనం



**అల్లూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త:** అల్లూరు లోని వినాయక దేవస్థానం వద్ద వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన మట్టి వినాయకునికి విశేషంగా రూపాయి బిల్లలతో అలంకరించి స్వామివారికి ఐదు రోజులు పాటు భక్తిశ్రద్ధలతో పూజలు నైవేద్యాలు పల్లకి సేవలు నిర్వహించారు. చివరి రోజున సుమారు 700 మంది అన్నదానం నిర్వహించారు. సాయంత్రం వేళ స్వామివారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి. పూజలు. పల్లకి సేవ. లడ్డు వేలం పాట అనంతరం దేవస్థానం వద్దనే భక్తులు మట్టి వినాయక స్వామివారికి నీళ్ల పోసి అక్కడే నిమజ్జనం చేశారు.

### అంతర జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన ఎమ్మెల్యే



**గుడ్లూరు, కందుకూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త:** గుడ్లూరు మండలం చేవూరులోని శ్రీ రామదూత అనాధ ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు ఆదివారం సాయంత్రం ఘనంగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులను అభినందించారు. సీనియర్ పురుషుల విభాగంలో కర్నూలు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. సీనియర్ బాలికల విభాగంలో విశాఖపట్నం జిల్లా విజేతగా నిలిచింది. సబ్ జూనియర్ బాలుర విభాగంలో చిత్తూరు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. సబ్ జూనియర్ బాలికల విభాగంలో విశాఖపట్నం జిల్లా విజేతగా నిలిచింది. విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రస్థాయిలో క్రీడల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడలు క్రమశిక్షణ, పట్టుదల, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయనీ అన్నారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, కందుకూరు పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు నార్నే రోశయ్య, పొట్టేళ్ల మురళి మరియు నిర్వాహకులు ముఖ్య అతిథులు పాల్గొన్నారు...

## ఘనంగా వినాయక చవితి వేడుకలు



**కోవూరు , ఆగస్టు 31 ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం గ్రామంలో వినాయకచవితి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆదివారం యువత ఉత్సవాలను ఘనంగా ముగింపు చేపట్టారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహానికి ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై కొలువు దీర్చి వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి పాటూరు నీటి సంఘం ఉపాధ్యక్షుడు సింగారెడ్డి లక్ష్మీనరసారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలతో కలిసి పాటలకు సరదాగా డాన్స్ చేసి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మన్నేపల్లి నాగేంద్ర, బాబ్జి, పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు.

## అనంత లోకాలకు వెళ్లిన గురువు బుజ్జయ్య



**కోవూరు , ఆగస్టు 31 ప్రభాతవార్త :** కోవూరులోని సీతారామ విద్యాలయంలో ఉపాధ్యాయుడిగా పనిచేసి ఎంతోమంది విద్యార్థులను మంచి నడవడికతో ముందుకు సాగేలా చొరవ తీసుకున్న బుజ్జయ్య ఆదివారం మృతిచెందారు. ఆ విద్యాలయంలో ఆయన ఉపాధ్యాయుడిగా ఎంతోమందికి విద్యాబుద్ధులు బోధించి ప్రస్తుతం వారందరూ మంచి స్థానంలో ఉన్నారు. అనేకమంది పేద విద్యార్థులకు తనవంతుగా సాయం చేసి క్రమశిక్షణ నేర్పిన వక్తి బుజ్జయ్య అని, ఆయన దగ్గర చదువు నేర్చుకున్న అనేకమంది విద్యార్థులు ఆదివారం తమ ఆవేదన వ్యక్తం చేశారు.

## డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడ దినోత్సవం



**కావలి, ఆగస్ట్ 31, ప్రభాతవార్త:** డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని కీర్తిశేషులు దామిశెట్టి శ్రీనివాస్ నాయుడు పేరు మీద ప్రతి సంవత్సరం విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభ అవార్డులు అందచేస్తామని కళాశాల సెక్రెటరీ డాక్టర్ దామిశెట్టి బాల సురేష్ బాబు, కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు ఆదివారం తెలియజేశారు మూడవ త్రీ ఏ సైడ్ వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలు డిబిఎస్ ఇంజనీర్ కళాశాలలో జరిగాయి. ఈ పోటీలలో కర్నూలు, చిత్తూరు, నంద్యాల, ప్రకాశం, కాకినాడ, వెస్ట్ గోదావరి, అనంతపూర్, సత్య సాయి తిరుపతి, బాపట్లఈ జిల్లాల నుండి పోటీల్లో పాల్గొన్నారు. ఈ జిల్లాల నుండి మొత్తం120 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో అండర్ 17 గర్ల్స్ లో అనంతపూర్ ఫస్ట్ ప్లేస్ ప్రకాశం సెకండ్ ప్లేస్, నెల్లూరు తాడ్ ప్లేస్ లో గెలుపొందారు. అదే క్రమంలోఅండర్17 బాయ్స్ లో ఫస్ట్ ప్లేస్ ప్రకాశం, సెకండ్ ప్లేస్ నెల్లూరు, థర్డ్ ప్లేస్ అనంతపూర్ గెలుపొందడం జరిగింది ఇక్కడ గెలుపొందిన బాలికల, బాలురు మహారాష్ట్ర షోలాపూర్ లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీవీ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ దామోదర్ రెడ్డి , డి బి ఎస్ ఇంజనీర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ దాసరి శివసాగర్ కుమార్ , ఇతర జిల్లాల నుండి సెక్రెటరీ నరసింహమూర్తి, అశోక్, సంజయ్, ప్రసన్న కుమార్, విద్యార్థిని విద్యార్థులుతదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జనానికి తరలిన గణనాధులు



**వింజమూరు, ఆగష్టు 31, ప్రభాతవార్త :** వినాయక చవితి పర్వదినాన్ని పురష్కరించుకుని గణనాధులు వాడవాడలో కొలువుతీరి 5 రోజులుగా పూజలందుకున్నారు. అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హక్తులు భక్తిశ్రద్ధలతో సమర్పించిన నైవేద్యాలను స్వామివారికి సమర్పించి భక్తులకు పంచిపెట్టారు. ఐదు రోజులుగా పూజలు అందుకున్న గణేశుడు ఐదవ రోజు ఆదివారం గంగమ్మ ఒడికి తరలుతున్నారు. వింజమూరులో పలు కూడళ్ళలో ఏర్పాటు చేసిన గణేష్‌ని విగ్రహాలను శనివారం కొన్ని, ఆదివారం ఐదవ రోజు అధిక సంఖ్యలో గణనాథులను తరలిస్తున్నారు. యువత ఎంతో ఉత్సాహంతో గణేశ పూజ నిర్వహించి నిమజ్జనానికి ఉత్సాహాన్ని చూపుతున్నారు. తప్పెట్లు, తాళాలు మధ్య బాణసంచా పేలుళ్ల శబ్దంతో భక్తుల ఆనందోత్సాహాల మధ్య గణనాథులు నిమజ్జనానికి గంగమ్మ ఒడికి తరలుతున్నారు.

## ప్రశాంతంగా నిమజ్జనాలు చేసుకోవాలి



**కోవూరు , ఆగస్టు 31 ప్రభాతవార్త :** కోవూరు మండల పరిషత్‌లోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసి ఉన్న వినాయక విగ్రహాల వద్ద నిర్వాహకులతో ఆదివారం కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి నిమజ్జనం, తదితర విషయాలపై ప్రత్యేకంగా చర్చించారు. విగ్రహ నిమజ్జన సమయంలో ఎటువంటి గొడవలు, అల్లర్లు లేకుండా ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో కొత్తవారు ఎవరైనా కనిపిస్తే వెంటనే అటువంటి సమాచారాన్ని పోలీస్‌స్టేషన్‌కు చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు , తదితరులు ఉన్నారు.

## నిమజ్జనానికి బయలుదేరిన గణనాథులు



**కోవూరు , ఆగస్టు 31 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని పలు ప్రాంతాల్లో వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాలకు ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి నిమజ్జనానికి బారులు తీరాయి. కోవూరు మండలం ఇనమడుగు, లేగుంటపాడు, వేగూరు, జమ్మిపాలెం, చెర్లోపాలెం, కోవూరు గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలు ఆదివారం మేళతాళాల నడుమ నిమజ్జనానికి బయలుదేరాయి. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఉదయగిరి సీఐ సూచనలు ఇవే



**ఉదయగిరి, ఆగష్టు 31, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి పోలీసు స్టేషన్ ఆవరణంలో ఆదివారం విగ్రహాలు పెట్టిన వారందరికి సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనాలు చేసుకోవాలని కమిటీ సభ్యులకు ఉదయగిరి సీఐ వెంకటరావు ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి సూచించారు. ఉదయగిరి మండల పరిధిలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నిమజ్జన సమయంలో బాణసంచా పేల్చే విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. నిమజ్జనం సమయంలో నీటి వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## అపసముద్రం గ్రామంలో నిమజ్జనంలో గాయపడిన చిన్నారులకు చేజర్ల ఆర్థిక సహాయం



**ఉదయగిరి, ఆగష్టు 31, ప్రభాతవార్త :** మండల పరిధిలోని అప్పనసముద్రం గ్రామంలో 3 రోజుల క్రితం జరిగిన వినాయక నిమజ్జనంలో బాణసంచా పేలి 9 మంది చిన్నారులు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ ఉపాధ్యక్షుడు చేజర్ల సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రసుటన అధినేత చేజర్ల సుబ్బారెడ్డి గ్రామంలో పర్యటించి బాధితులను పరామర్శించారు. అనంతరం పాక్షికంగాగాయ పడిన ముగ్గురు చిన్నారులకు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం 10 వేలు రూపాయలు వంతు అందజేశారు. అనంతరం ఆత్మకూరులో చికిత్స పొందుతున్న మరోముగ్గురికి 20 వేలు చొప్పున, నెల్లూరులో చికిత్స పొందుతున్న మరో చిన్నారికి రూ.25వేలు, మరొకిరిక రూ.5వేలు చొప్పున మొత్తం రూ.1.20 లక్షలు అందజేశారు ఆయన గ్రామానికి చెందిన చిన్నారులు గాయపడిన విషయం తెలుసుకున్న చేజర్ల హుటాహుటీన వచ్చి చిన్నారులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

## నిమజ్జనానికి తరలిన గణనాధులు



**ఉలవపాడు, ఆగష్టు 31, ప్రభాతవార్త :** వినాయక చవితి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాధుల విగ్రహాలను ఐదవ రోజైన ఆదివారం నిమజ్జనం చేశారు. ఉదయం పూజా కార్యక్రమాల అనంతరం మండలపాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమాలను చేపట్టారు. తదనంతరం విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో గ్రామోత్సవం నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా బద్దిపూడి, భీమవరం, రాజుపాలెం, మన్నేటికోట, చాగల్లు, చాకిచర్ల గ్రామాలతో పాటుమండలంలోని మరికొన్ని గ్రామాల్లో గణనాధులునిమ జ్జనానికి తరలివెళ్లారు. శుక్రవారం మండలంలో 33 వినాయక విగ్ర హాలను నిమజ్జనంచేశారు. నిమజ్జన సమయంలో ఎటువంటి అ వాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై అంకమ్మ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

### దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 16వ వర్ధంతి



**లింగసముద్రం, ఆగష్టు 31, ప్రభాతవార్త:** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 16వ వర్ధంతి కార్యక్రమాన్ని ఈనెల రెండవ తేదీన మంగళవారం నిర్వహించడం జరుగుతుందని వైసీపీ మండల అధ్యక్షులు నోటి వెంకటేశ్వర రెడ్డి ఆదివారం ప్రకటన తెలిపారు. మండల కేంద్రమైన లింగసముద్రంలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం కి ఉదయం 10 గంటలకు నివాళులర్పించడం జరుగుతుందని, ఎంపీపీ ఎంపీటీసీలు ,సర్పంచులు, వైయస్సార్ అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## మండలంలో ఘనంగా వినాయక చవితి నిమర్జనం

**లింగసముద్రం ఆగస్టు 31 ప్రభాతవార్త:** మండలంలోని గతంలో ఎన్నడూ లేని విధంగా గణేశుని ఆదివారం నిమజ్జన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఐదు రోజులపాటు గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్నేశ్వరుని విగ్రహాల వద్ద విశేష పూజలు అందుకున్న గణనాధుని గ్రామాల్లో డాక్టర్లపై ఏది ఊరేగింపజేసి నిమజ్జనానికి తరలి వెళ్లారు. భారీగా పలికిన లడ్డు వేలం మండల కేంద్రమైన లింగసముద్రం తో పాటు, మాలకొండరాయుని పాలెం, జంపాలవారి పాలెం, వెంగళాపురం గ్రామంలోని వినాయకుని లడ్డు వేలం పాటల జరిగాయి. జంపాలవారిపాలెం గ్రామంలో 65 వేలకు జంపాల కవిత లడ్డును దక్కించుకున్నారు. వెంగలాపురం గ్రామంలో రెండు వినాయక విగ్రహాల దగ్గర లడ్డు పాట నిర్వహించగా ఒక విగ్రహం దగ్గర కనకం వెంకటేశ్వర్లు 40,000కు మరొకచోట వెలుగు వీరాంజనేయులు 95 వేలకు అలాగే మాలకొండ రాని పాలెం గ్రామంలో రాగిణి దంపతులు 20వేలకు లడ్డూను దక్కించుకున్నారు. గంగపాలెం లో వినాయకుడి నిమర్జనం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు అత్తంటి వెంకట్రావు 40 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఐదు రోజులపాటు పూజలు అందుకున్న గణేశుడిని గ్రామంలోని వీధుల్లో బాణా సంచాలు కాలుస్తూ, రంగులు చల్లుకుంటూ ఆనందోత్సవాలతో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిమజ్జనం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నేటి సమాజంలో సంక్లిష్టంగా మారిన వివాహవ్యవస్థ

**కావలి, ఆగష్టు 31, ప్రభాతవార్త :** నేటి సమాజంలో సంక్లిష్టంగా వివాహ వ్యవస్థ మారిందని కాపాడుకొనే బాధ్యత కుటుంబాల మీద మాత్రమే ఉందని నేటి వారం వారం చర్చాగోష్టిలో కలయిక విజ్ఞానకేంద్ర మిత్రబృందం వెల్లడించడం జరిగింది నేటి సమాజంలో వివాహవ్యవస్థ అంశంపై సి.శారద అధ్యక్షతన ఆదివారం చర్చ జరిగిన కార్యక్రమంలో నక్కా సాయిరాం ప్రసాద్, కె గోపీకృష్ణ, ఎమ్.కవిత ఎమ్.రజనీ కాంత్, జి. లావణ్య, జి. రాంప్రసాద్, చన్నా వెంకట్రామయ్య, దస్తగిరి భాషా, ఎమ్‌వివిఎన్ ప్రసాదరావు, నల్లూరి రామకృష్ణ, పెంచల నరసారెడ్డి, పి.రమేష్, ఎమ్.పార్వతీ శంకర్ తదితర మిత్రబృందం పాల్గొని చర్చలో తమ అభిప్రాయాలను వెల్లడించి మాట్లాడారు భారతీయ సంస్కృతి లో వివాహ వ్యవస్థ అత్యంత పవిత్రమైనదని, సమాజాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని, పరస్పర విశ్వాసం, ప్రేమానురాగాలు, సామరస్యం, ఆత్మీయబాబ్ధం ఏర్పరచి కుటుంబ బంధాలు బలోపేతం చేయడానికి వివాహ వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతుందని సభ్యులు పేర్కొన్నారు ఇంతటి గొప్ప వ్యవస్థ ఆధునిక యుగంలో కూడా కొనసాగుతోందని, అయినా, ఆర్థిక, సామాజిక పరిస్థితులు మనస్తత్వాల్లో వ్యత్యాసాల, గొంతెమ్మ కోరికలు, ఇగో ఇజం, వ్యక్తిగత స్వోత్కర్ష, పెద్దల అనవసరపు ప్రమేయం వివాహాలను ప్రభావితం చేస్తూ విడాకుల దాకా రావడం విచారకరం అన్నారు. ఉద్యోగస్తులైన దంపతులు సర్దుబాటు గుణం లేక, చెప్పుడు మాటలతో దుష్ప్రభావాలకు గురవుతున్నారని, పరస్పరం అనుమానాలకు లోనవుతున్నారని, కుటుంబ సభ్యుల మధ్య విభేదాలు తలెత్తుతూ గోరంతలు కొండంత చేసుకుంటూ వివాహాన్ని ధ్వంసం చేసుకుంటున్నారని , తమ సంతానం ఈ ప్రభావంతో భవిష్యత్ ను గురించి ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కన్యాశుల్కం నుండి వరకట్నం వరకూ వివాహ బంధాన్ని నాశనం చేసే శక్తులైనాయని ఆడ మగ పిల్లలిద్దరినీ తమకాళ్లపై తాము నిలబడేలా చదివించి విలువలను పెంచే పెంపకం అందించి, వివాహ విషయంలో పిల్లల స్వంత అభిప్రాయాలను తెలుసుకుని వారికి పెళ్ళి చేయడం సముచితం అన్నారు.

# వైభవంగా గణేష్ నిమజ్జనాలు



**చేజర్ల ఆగష్టు 31 ప్రభాతవార్త :** చేజర్ల మండలంలోని పలు గ్రామాలలో వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను 5 వ రోజు వైభవంగా నిమజ్జనానికి తరలించారు. వినాయకుడి విగ్రహాలను ఊరేగింపుగా యువత రంగులు చల్లుకుంటు సందడి చేశారు. విగ్రహాలను పెన్నానదిలో నిమజ్జనం చేశారు. తొలుత యువత ఉత్సహంగా ఉట్టిని కొట్టారు. అనంతరం లడ్డు వేలం పాటలు నిర్వహించారు. చేజర్లలలోని ఆర్యవైశ్యుల వీధిలో ఏర్పాటు చేసిన గణనాధుడికి 5 రోజులు వేడుకగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్య నాయకులు దేవతి సుబ్బారావు.కె ,చిట్టిబాబు, శేషయ్య నాయుడు ఉభయ దాతలుగా వ్యవహారించారు.గణనాధుడ్ని ఊరేగింపు తీసుకెళ్ళి పెన్నానదిలో నిమజ్జనం చేశారు. యువత ఉత్సహంగా నిమజ్జానానికి తరలి వెళ్లారు. చేజర్ల ఎస్ఐ జె తిరుమలరావు బందో బస్తు ఏర్పాటు చేశారు.

# చేజర్ల సొసైటీ అధ్యక్షుడ్ని కలిసిన దళితనాయకులు



**చేజర్ల ఆగష్టు 31 ప్రభాతవార్త :** చేజర్ల మండలం సొసైటీ అధ్యక్షులు బూదళ్ళ వీరరాఘవరెడ్డి ఆదివారం చేజర్ల ఎస్‌సిసెల్ నాయకులు సోమవరపు హజరత్తయ్య గ్రామస్తులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతనంగా సొసైటీ అధ్యక్షులుగా బూదళ్ళ వీరరాఘవరెడ్డిని ఎంపిక చేయడం పట్ల ఎస్‌సిసెల నాయకులు శాలువతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు రవికుమార్, తిరపతయ్య, బర్రెల బాబు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీసాయి సచ్చరిత్రముల శోభాయాత్ర



**నెల్లూరు రూరల్, ఆగస్టు 31, ప్రభాతవార్త :** బాలాజీ నగర్ చివర పద్మావతి నగర్‌లో ఉన్న శ్రీసాయిదర్బార్ అద్దాల మందిరములో శ్రీసాయి మాలధారణ మండల దీక్ష శిరిడీ యాత్ర సందర్భంగా అదివారం ఉదయం శ్రీసాయిదర్బార్ నుండి నెల్లూరు నగర పురవీధులలో సాయి భక్తులు శ్రీసాయి సచ్చరిత్రమునకు విశేష పుష్పాలంకరణతో, శ్రీసాయినామ సంకీర్తనలతో శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ శోభాయాత్రలో సాయి స్వాములు అందరూ పరమ పవిత్రమైన శ్రీసాయి సచ్చరిత్ర గ్రంథమును పట్టు వస్త్రములో చుట్టుకొని వారి శిరస్సు పై పెట్టుకొని సాయి సాయి నామం సంకీర్తన చేస్తూ యాత్రని చేపట్టారు. ఈ శోభాయాత్ర శ్రీసాయిదర్బార్ నుండి పద్మావతి నగర్,బాలాజీ నగర్,విజయ్ మహాల్ గేటు మీదుగా గాంధీ బొమ్మ, ఆత్మకూరు బస్టాండ్, ఏ సి నగర్, ద్వారకామాయి నగర్ మీదుగా తిరిగి మందిరానికి చేరుకుంది. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద వినియోగం చెసారు. ఈ శోభాయాత్ర లో మందిర చైర్మన్ మధు సాయి, పాబోలు రామ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# చైర్మెన్ ఆదేశాలతో ఫయాజ్‌కే గంధం : ఇఒ హుస్సేన్



**అనుమసముద్రంపేట, ఆగస్టు31,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఏఎస్‌పేటలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీహజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబేరసూల్ స్వామివారి దర్గా వక్ఫ్‌బోర్డ్ కార్యాలయంలో దర్గా ఇఒ షేక్ మొహమ్మద్ హుస్సేన్ ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హజరత్ స్వామివారి ధర్మపత్ని శ్రీహబీబా ఖాతూన్ దొరసానమ్మ (ఉరఫ్అమ్మాజాన్) వారి 252వ గంథమహోత్సవం ఎత్తడానికి తమకు అవకాశం కల్పించాలని దర్గా సంబంధీకులైన ఎస్.జి.ఎన్.హాఫీజ్‌పాషా, ఎస్.జి.ఎన్.ఫయాజ్అహ్మద్,



ఎస్.జి.ఎన్.సఫీస్ పాషాలు రాష్ట్ర వక్ఫ్‌బోర్డుకఉ దరఖాస్తు చేసుకున్నారని దరఖాస్తులను పరిశీలించిన రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ అధికారులు చైర్మెన్ హాజీ షేక్ అబ్దుల్ అజీజ్ ఆదేశాలతో వారిని విచారణకు పిలిపించగా ఫయాజ్ అహ్మద్ హాజరు కాగా నసీఫ్ గైర్హాజరయ్యారని హాఫీజ్‌పాషా తన న్యాయవాది ద్వారా సామాజిక మాధ్యమంలో అభ్యంతరం వ్యక్తం చేశారని, వాటన్నింటిని పరిశీలించిన రాష్ట్ర సిఇఒ షేక్ మొహమ్మద్ అలీ, చైర్మెన్ అబ్దుల్ అజీజ్ ఆదేశాలతో గత రెండు సంవత్సరాల నుండి గంథం ఎత్తుతున్న ఎస్‌జిఎన్‌ఫయాజ్ అహ్మద్‌కు ఈసారి కూడా అవకాశం కల్పిస్తూ తాత్కాలిక ఉత్తర్వులు కేవలం ఒకరోజు గంథం ఎత్తడానికి మాత్రమేనని మిగిలిన రెండురోజులు దీపాలంకరణ, తహలీల్ ఫాతిహా కార్యక్రమాలు యధావిధిగా సజ్జాదనషీన్ హాఫీజ్‌పాషా నిర్వహిస్తారని ఇఒ తెలిపారు. ఇరువర్గాలు ఎలాంటి భేషజాలకు వెళ్ళకఉండా సామరస్యంగా గంథమహోత్స కార్యక్రమాలను నిర్వహించాలని ఇఒ సూచనలు చేశారు.

# భక్తి శ్రద్ధలతో గంధం దంచే కార్యక్రమం



**అనుమసముద్రంపేట, ఆగస్టు31,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఏఎస్‌పేట లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీహజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబే రసూల్ స్వామివారి ధర్మపత్ని శ్రీహబీబా ఖాతూన్ దొరసానమ్మ వారి 252వ గంథమహోత్సవంలో భాగంగా ఆదివారం గంథం దంచే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో గంథమహల్‌లో దర్గా ఇఒ షేక్ మొహమ్మద్ హుస్సేన్ , దర్గా వంశస్తులు ఎస్.జి.ఎన్.ఫయాజ్అహ్మద్, షఖీల్ అహ్మద్, గౌస్‌బాషా భక్తులు ప్రత్యేక ఫాతిహాలు చదివి ప్రారంభించారు. గంథం దంచడానికి మహిళా భక్తులు భారీగా పాల్గొని భక్తిశ్రద్ధలతో గంథం దంచారు. ఏడాదికోసారి జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొని గంథం దంచడం ఎంతో సంతోషంగా ఉందని భక్తులు తెలిపారు. భక్తులకు దర్గా వంశస్తులు మంచినీరు ఏర్పాటు చేయగా వక్ఫ్‌బోర్డ్ ఆధ్వర్యంలో క్యూలైన్ల కొరకు బారికేడ్లు , షామియానాలు ఏర్పాట్లు చేశారు.

# నిమజ్జనానికి మైపాడు బీచ్‌కి తరలిన గణనాథులు







**ఇందుకూరుపేట, ఆగస్టు 31, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట మండలంలోని మైపాడు బీచ్‌లో నిమజ్జనానికి ఆదివారం వందలాది గణనాథులు తరలివచ్చారు. తప్పెట్ల మోతలతో డీజే సౌండ్లతో తీన్మార్ మేళాలతో భక్తి గీతాలతో యువత నృత్యాలతో గణేష్ నామస్మరణతో వందలాది గణనాథులను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఎస్సై నాగార్జునరెడ్డి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

# దేశ ప్రధాని తల్లిని అవమానపరిచేలా కాంగ్రెస్ దూషణ

**- వెంటనే కాంగ్రెస్ నాయకత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ - బీజేపీ జిల్లా నేత చిలకా ప్రవీణ్**



**నెల్లూరు అగ్రికల్చర్, ఆగష్టు 31, ప్రభాతవార్త :** ఒక పేదింటి తల్లి, తన కుమారుడిని దేశ సేవకు అంకితం చేసి ఆయనను ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుడిగా తీర్చిదిద్దిందని అలాంటి మహనీయు రాలిపై కాంగ్రెస్ నాయకత్వం చేసిన అసభ్య పదజాలం, భారతీయ సంస్కృతికి ప్రజాస్వామ్య విలువలకు జరిగిన ఘోర అవమానమని, బీజేపీ జిల్లా నేత చిలకా ప్రవీణ్ ఒక ప్రకటనలో ఖండించారు. ప్రధానమంత్రి యొక్క దివంగత మాతృమూర్తిపై మాట్లాడడం సిగ్గుచేటని, ఇది కాంగ్రెస్ పార్టీ పతనానికి నిదర్శనమని ఆయన అన్నారు. ఈ ఘటనతో కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందని, వ్యక్తిగత దాడులు చేయడం ద్వారా ప్రజల హృదయాలను గెలవలేరని హెచ్చరించారు. బీహార్లో ప్రారంభమైన ఈ అసభ్య వ్యాఖ్యల వివాదానికి తగిన సమాధానం అక్కడి ప్రజలు రాబోయే ఎన్నికల్లో చెప్తారని, కేవలం బీహార్ ప్రజలు మాత్రమే కాదు, దేశ వ్యాప్తంగా 140 కోట్ల మంది భారతీయులు కూడా కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. కాంగ్రెస్‌కు ప్రజల గౌరవం, భావోద్వేగాలు ఎంత విలువైనవో వారికి తెలియదని, ఓటర్లు ఈ సారి కాంగ్రెస్ అహంకారానికి తగిన గుణపాఠం చెప్తారని, కాంగ్రెస్ నాయకత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మోడీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారికి చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కాంగ్రెస్ ఎంత ప్రయత్నించినా ప్రజల విశ్వాసాన్ని వారు గెలవలేరని స్పష్టం చేశారు.

# మన్‌కి బాత్-ప్రధానమంత్రి సందేశాన్ని ప్రజలతో పంచుకున్న బీజేపీ జిల్లా నేత చిలకా ప్రవీణ్ కుమార్

**- వోకల్ ఫర్ లోకల్- స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రధాని పిలుపు**
**- ప్రతిభా సేతు ప్లాట్ ఫారమ్- వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించే దిశగా కేంద్రం**



**నెల్లూరు అగ్రికల్చర్, ఆగష్టు 31, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ పరిధిలోని 19వ డివిజన్ శ్రీనగర్‌లో ఉన్న 172 బూత్, స్థానిక ప్రజలతో నిర్వహించిన మాన్‌కి బాత్ కార్యక్రమలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన ముఖ్య విషయాలను బీజేపీ జిల్లా నాయకుడు చిలకా ప్రవీణ్ కుమార్ స్థానిక ప్రజలతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ సహజ విపత్తుల బాధితుల పట్ల కేంద్రం చూపిస్తున్న దృష్టి, యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించడానికి చేస్తున్న ప్రయత్నాలు, గ్రామీణాభివృద్ధి కోసం సౌరశక్తి వినియోగం, ఉద్యోగావకాశాల కల్పన, స్వదేశీ ఉత్పత్తుల ప్రోత్సాహం వంటి పలు కీలక అంశాలు ప్రధాని ప్రసంగంలో ఉన్నాయని చెప్పారు. దేశంలో ఏర్పడే సహజ విపత్తుల బాధితులకు ప్రధానమంత్రి భరోసా స్పష్టంగా కనిపిస్తుంది. దేశంలో వరదలు, తుఫానులు వంటి సహజ విపత్తులతో నష్టపోయిన ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల సహాయం అందిస్తుందని ప్రధాని హామీ ఇచ్చారు. జమ్మూ కాశ్మీర్‌లో ఖేలో ఇండియా క్రీడా ఉత్సవాలు యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు కొత్త ఉత్సాహాన్ని కలిగిస్తున్నాయని ప్రధాని పేర్కొన్నారు. దేశ గర్వకారణమైన విజయాలు రష్మితా సాహు, మోహ్సిన్ అలీ వంటి క్రీడాకారుల విజయాలను ప్రధాని ప్రత్యేకంగా ప్రశంసించారు. వారి ప్రతిభ దేశానికి గర్వకారణమని అభివర్ణించారు. ప్రతిభా సేతు ప్లాట్ ఫారమ్ వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించేలా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన డిజిటల్ వేదిక ప్రతిభా సేతు గురించి ప్రధాని వివరించారు. సౌరశక్తితో గ్రామీణాభివృద్ధి సోలార్ దీదీ విజయాన్ని మన్‌కి బాత్‌లో ప్రస్తావిస్తూ గ్రామీణ మహిళలు సాంకేతిక రంగంలో అగ్రగాములుగా నిలుస్తున్నారని ప్రధాని అభివర్ణించారు. విశ్వకర్మ యోజన వృత్తిదారులకు వరం వృత్తి దారుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన విశ్వకర్మ యోజన పథకం గురించి ప్రజలకు ప్రవీణ్ కుమార్ వివరించారు. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించండి, దేశీయ ఉత్పత్తులను వినియోగించాలని, స్థానిక వ్యాపారులను ప్రోత్సహించాలని ప్రధాని వోకల్ ఫర్ లోకల్ పిలుపునిచ్చారు. పండుగలతో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, పర్యావరణ పరిరక్షణపై దృష్టి పెట్టాలని ప్రధాని సూచించారు. ఆత్మనిర్భర్ భారత్ సాధన, ప్రతి భారతీయుడు స్వయం ప్రతిపత్తి సాధనలో భాగస్వామి కావాలని, దేశ అభివృద్ధి కోసం అందరూ కృషి చేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. ప్రధాని ప్రతి పిలుపు మనందరికి ప్రేరణ. మన్‌కి బాత్‌లో చెప్పిన ప్రతి అంశం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా మార్గదర్శకంగా ఉంటుంది. మనందరం కలిసి ప్రధాని సూచనలను పాటించి, దేశాభివృద్ధిలో భాగస్వాములమవ్వాలని పిలుపునిచ్చారు.

# 45వేలకు వేలంపాటలో వినాయక లడ్డు దక్కించుకున్న మెతుకు కుటుంబం



**బిట్రగుంట, ఆగష్టు31, ప్రభాతవార్త:** బోగోలు బజారుసెంటర్‌లోని యూనియన్‌బ్యాంక్ సమీపాన నెలకొల్పబడిన వినాయకచవితి సందర్భంగ ఆదివారం వినాయకవగ్రహంవద్ద జరిగిన లడ్డువేలంపాటలో రాష్ట్ర యువకాపునాడు ఆధ్యక్షురాలు మెతుకు రాజేశ్వరి కుటుంబసభ్యులు 45వేల రూపాయలకు వేలంపాటలో వినాయకలడ్డును దక్కించుకున్నారు.పోటాపోటీగ జరిగిన ఈ వేలంపాటు ఆశక్తికరంగ కొనసాగింది.ఐదురోజులపాటు పూజలందుకున్న యూనియన్‌బ్యాంక్ సమీపంలోవున్న వినాయక విగ్రహానికి చివరిరోజు నిమజ్జనానికి బయలుదేరేముందు 108రకాల పిండివంటలతో నైవేద్యాన్ని సమర్పించారు.అనంతరం గణేష్‌కమిటి ఆద్వర్యంలో విగ్రహాన్ని ఊరేగింపుగ నిమజ్జనానికి తీసుకెళ్ళారు.

# ప్రశాంతంగ వినాయక విగ్రహాల నిమజ్జనం



**బిట్రగుంట, ఆగష్టు31, ప్రభాతవార్త:** బోగోలు మండలం తాటిచెట్లపాళెం సముద్రతీరాన ఆదివారం వినాయక విగ్రహాల నిమజ్జనకార్యక్రమం ప్రశాంతంగజరిగింది.వివిదగ్రామాలనుంచి 5రోజులపాటు పూజలందుకున్న వినాయకవిగ్రహాలు డిజె,మైకుల చప్పుళ్ళతో పిల్లలు పెద్దలు మహిళలు కేరింతలతో ఉత్సాహంగ సముద్రతీరాన వారు నెలకొల్పబడిన విగ్రహాలను స్వయంగ నిమజ్జనంచేసిబందుమిత్రుసమేతంగ సముద్రస్నానాన్ని ఆచరించి ఇందులోపాల్గొన్నారు.దీంతో సముద్రతీరమంత పండుగవాతావరణంతో కోలాహలంగ మారింది.ఎలాంటి విపత్తులు సంభవించకుండ పోలీసుయంత్రాంగం వరుసక్రమంలో విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు బందోబస్తు ఏర్పాటుచేశారు.

# కారులో తరలిస్తున్న గంజాయి స్వాదీనం

**బిట్రగుంట, ఆగష్టు 31, ప్రభాతవార్త :** బోగోలు మండలం విశ్వనాధరావుపేట పంచాయతి ఇబ్రహీంపేట వద్ద కావలి రూరల్ సిఐ పాపారావు బిట్రగుంట ఎస్.ఐ ప్రభాకర్ వాహనాల తనిఖీచేస్తుండగ నెల్లూరు నుండి బిట్రగుంట వైపు వస్తున్న కారులో ప్రయాణిస్తున్న షేక్ మస్తాన్, షేక్ లతీఫ్, వంటేరు సుమన్‌కుమార్, షేక్ సుల్తాన్‌భాషలు వద్ద నుండి ఆరు కేజిల గంజాయిని స్వాదీనం చేసుకొని నలుగురు నిందితులను కావలి కోర్టులో హాజరుపరచినట్లు బిట్రగుంట ఎస్.ఐ ప్రభాకర్ తెలిపాడు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



**కందుకూరు.ఆగష్టు 31,ప్రభాతవార్త:** పట్టణంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు ఉన్నం కొండలరావు స్వగృహంలో ఆదివారం జరిగిన కుమార్తె వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, పార్టీ నాయకులు నార్నే రోశయ్య, షేక్ రఫీ, మాదాల మాల్యాద్రి మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు..

# అంకమ్మ తల్లి అనివేటి మండపానికి రూ.25 వేలు విరాళం



**కందుకూరు,ఆగష్టు 31,ప్రభాతవార్త:** పట్టణంలోని శతాబ్దాల నాటి గ్రామదేవత అంకమ్మ ఆలయ జీర్ణోద్ధరణకు భక్తులు స్వచ్ఛందంగా విరాళాలు అందిస్తున్నారు. 4 కోట్ల వ్యయంతో అనివేటి మండప నిర్మాణం జరుగుతోంది. రాతి శిల్పాలతో అపురూపంగా రూపుదిద్దుకుంటున్న అనివేటి మండపానికి దివి కోటేశ్వరరావు దంపతులు ఆదివారం రూ.25 వేలు విరాళంగా ఇచ్చారు. అలాగే పట్టణానికి చెందిన పొన్నూరు వెంకట మోహనరావు ధర్మపత్ని శ్రీమతి వెంకట సుజాత దంపతులు రూ 5116/లు కమిటీ సభ్యులు పిడికిటి వెంకటేశ్వర్లు, మంచిరాజు మురళీ మోహన్ కి ఈ విరాళాలను అందజేశారు.

# ఇకనైనా మారండి



**కోవూరు,ఆగష్టు 31 ప్రభాతవార్త :** కోవూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో కేడీలుగా, అనుమానితులుగా , రౌడీలుగా లిస్టులోకి ఎక్కిన వారు ఇకనైనా తమ తీరు మార్చుకుని బుద్ధిగా మెలగాలని కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ అన్నారు. కోవూరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రౌడీ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకనైనా బుద్ధిగా మలుచుకుని మంచి ప్రవర్తనతో ముందుకు సాగితేనే మీ బతుకులు బాగు పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు ఉన్నారు.

# రాపూరు ఫారెస్ట్ రేంజ్ ఇన్‌ఛార్జీ ఆఫీసర్ గా మాల్యాద్రి



**రాపూరు,ఆగష్టు 31,ప్రభాతవార్త:** రాపూర్ అటవీ శాఖ ఫారెస్ట్ రేంజ్ ఇన్‌ఛార్జీ ఆఫీసర్ గా సోమవరపు మాల్యాద్రి నియమితులైనారు. గతం లో ఇక్కడ పనిచేస్తున్న రేంజర్ ఆదివారం పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో రాపూరు ఇన్‌ఛార్జీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా సోమ వరపు మాల్యాద్రిని నియమించారు. ఈయన నెల్లూరు తెలుగుగంగ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గా పని చేయుచున్నారు సోమవారం ఈయన పదవి బాధ్య తలు చేపట్టినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

## మార్కెట్ వినాయకుడి లడ్డు వేలం 31 వేల 116



**బుచ్చి ఆగష్టు 31 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీలోని మార్కెట్ వీధి లో ఏర్పాటు చేసిన వినా యకుడి విగ్రహం వద్ద లడ్డు వేలం పాట నిర్వహించగా కొపర్తి రమణయ్య 31వేల 116 రూ పాయాకులు పాడారు. కమీటి వారు అత్యంత వేడుకగా భక్తి శ్రద్దలతో రమణయ్య కుటుంబ సభ్యులకు లడ్డును అందజేశారు. అలాగే పూలమాల వేలం పాటను అచ్యుత్ బాలయ్య పాడారు. కోలహలంగా పూల మాలను ఆయన ఇంటి వద్ద నుండి తీసుకొని వచ్చారు. వేడుగా స్వామి వారి నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో కమీటి సభ్యులు తెల్లనాకుల సుబ్బారావు, రాచూరు రమేష్, పాబోలు శ్రీనివాసులు, సొల్లేటి సత్యం, సొల్లేటి రాధయ్య, ఎస్వి సురేష్, చేగు నాగభూషణం, చేగు నాగేశ్వరరావు, మాకం రమేష్, మెంటా ఆనంద్, శ్రీరాం నరసింహరావు, చీదెళ్ళ వెంకటేశ్వర్లు, ఎం.సత్యం పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో పుట్టా దంపతులు



**బుచ్చి ఆగష్టు 31 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం విలియమ్స్ పేట గ్రామంలోని ఎస్టి కాలనీలో గల గణేష్ సేవా సమితి వారు ఏర్పాటు చేసిన 15 అడుగుల మహా గణపతి విగ్రహాన్ని జొన్నవాడ దేవస్థానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సుబ్రమణ్యంనాయుడు మాట్లాడుతు విలియమ్స్ పేట గ్రామంలో ఇంత పెద్ద విగ్రహం పెట్టడం ఆనందంగా ఉందని అన్నారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి , కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నాయకత్వంలో ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని దేవుని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో విగ్రహా కమీటి వారు పాల్గొన్నారు.

## వైభవంగా గణనాధునికి పూజలు



**బుచ్చి ఆగష్టు 31 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని కోదండరామపురంలో వినాయక చవితి పురస్కరించుకొని ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద ఆప్రాంత ప్రజలు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. భక్తులకు పెద్దఎత్తు ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో సీనియర్ తెలుగుదేశం నాయకులు కావలి వెంకటేశ్వర్లు, చోళం వెంకయ్య, సిఐటియు నాయకులు చల్లకొలుసు మల్లికార్జున పాల్గొని స్వామి వారిని దర్శించుకొని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.

## ఇనుగూరు బాలయ్య నాకు సొంత అన్నలాంటి వారు
### వైసిపి ఉదయగిరి ఇన్‌ఛార్జీ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి





**బుచ్చి ఆగష్టు 31 ప్రభాతవార్త** సీనియర్ బిజెపినాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు ఇనుగూరు బాలయ్య తనకు సొంత అన్నలాంటి వాడని వైసిపి ఉదయగిరి ఇంచార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కున్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని బాలయ్య రైస్ మిల్లు వద్దకు విచ్చేసి బాలయ్యను, ఆయన కుమారులు శ్రీనివాసులు, బాలుతో ఆయన చాలా సేపు అప్యాయంగా మాట్లాడారు. తమ స్వగ్రామం, బాలయ్య వాళ్ళ గ్రామం పక్కపక్కనే అని మా అన్న శేఖరయ్య క్లాస్ మీట్ అని స్పష్టం చేశారు .. బాలన్నకు మా కుటుంబం అంటే ఎంతో అభిమానం అని చెప్పారు. ఆయన ఉదయగిరి ప్రాంతాన్ని విడిచిపెట్టి వచ్చేసి సుమారు 45 సంవత్సరాలు అవుతున్నా నేటికి మా కుటుంబాన్ని గుర్తు పెట్టుకొని మా మీద ఎంతో అప్యాయతగా ఉంటారని అన్నారు. ఈ సందర్బంగా బాలయ్య కుమారులు మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని, ఇనుగూరు బాలయ్యను శాలువా కప్పి సన్మానించారు.

## చీదరాల చెన్నయ్యకు జాతీయ తెలుగు బాషా పురస్కారం



**బుచ్చి ఆగష్టు 31 ప్రభాతవార్త** :ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత సంస్కృతి సమితి, శాంతా వసంత ట్రస్టు సౌజన్యంతో సేవా తెలుగు భాషా సాహితీ సాంస్కృతిక సంస్ధవారు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని ఈనెల 29 నుండి 31 వరకు " జాతీయ తెలుగు భాషా ఉత్సవాలు " నెల్లూరులోని పురమందిరం నందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా డాక్టర్ చీదరాల చెన్నయ్య ఉపాధ్యా యులుగా తెలుగు బాషకు చేయుచున్న కృషికి 31 వ తేది ఆదివారం జాతీయ తెలుగు బాషా పురస్కారం నిర్వాహకుల చేతుల మీదుగా అందుకున్నారు. ఈకార్యక్ర మంలో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, పద్మశ్రీ డాక్టర్ కొలకలూరి ఇనాక్, సాహితి ప్రియులు, భాషాభిమానులు, పురప్రముఖులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా గ్రామోత్సవం

### ఆకట్టుకున్న గంగా హారతి- మైమరిపించిన శివ పార్వతుల నృత్యాలు







**కోవూరు , ఆగష్టు 31 ప్రభాతవార్త** : కోవూరులోని టీఎన్‌సీ సెంటర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహానికి ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు గతంలో ఎన్నడూ లేని విధంగా రెండవసారి గంగాహారతి కార్యక్రమాన్ని సాంప్రదాయబద్ధంగా చేపట్టి ప్రజలను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా నికేష్ ఈవెంట్ ఆధ్వర్యంలో చేపట్టిన శివపార్వతుల నృత్యాలు అక్కడికి చేరిన ప్రతి ఒక్కరిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మేళతాళాలు, తప్పెట్లు, కేరళ బ్యాండ్, మంగళవాయిద్యాల నడుమ ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమాలు ఆదివారం జరిగాయి. స్వామివారి నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈవెంట్ కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. భారీ సెట్టింగులు, విద్యుద్దీపాల వెలుగుల్లో ఈ వినాయకుడు నిమజ్జనానికి బయలుదేరారు. ఈ ఉత్సవంలో యువత, చిన్నారులు పెట్టే కేరింతలు అందరినీ అలరింపజేశాయి. తొలిసారిగా మండలంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాలను వీక్షించేందుకు పలు ప్రాంతాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా హాజరయ్యారు. ఈ గ్రామోత్సవ ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు కోవూరు ఎస్సై రంగనరాథ్ గౌడ్ ప్రత్యేక ఏర్పాటు చేశారు.

## మొగిలిశెట్టి జమునకు సత్కారం



**కావలి, ఆగస్టు 31, ప్రభాతవార్త:** గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా కావలి పట్టణం వెంగళరావు నగర్ కు చెందిన విశ్వోదయ బాలికోన్నత పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయని మొగిలిశెట్టి జమునను ఆదివారం పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలోని భువనచంద్ర టౌన్ హాల్ నందు శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో తెలుగుతేజం పురస్కారాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ ముఖ్యఅతిథిగా పాల్గొని అంతర్జాతీయ శ్రీ శ్రీ కళావేదిక సీఈవో హంస అవార్డు గ్రహీత కత్తి మంద ప్రతాప్ సన్మానాన్ని స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమెను దుశ్శాల వాలతో పూలమాలలతో ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాన్ని, జ్ఞాపికను అందజేయడం జరిగింది కావలి పట్టణంలోని పలువురు ప్రముఖులు సన్నిహితులు శ్రేయోభిలాషులు మొగిలి శెట్టి జమునకు అభినందనలు తెలియజేశారు

## గణనాధుడికి శ్రీ లక్ష్మి కుబేర పూజ
### - గణనాధునికి కరెన్సీ నోట్లతో ప్రత్యేక అలంకరణ



**కావలి, ఆగస్టు31, ప్రభాతవార్త:** కావలి కలుగోలమ్మ పేటలోని శ్రీ కలుగోళ శాంభవి దేవి ఆలయ ప్రాంగణం నందు మానస సెంటర్ గణేష్ ఉత్సవ కమిటీ నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని కావలి మాజీ ఏఎంసీ చైర్మన్, రాష్ట్ర తెలు గుదేశం పార్టీ కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వ ర్యంలో జరుగు ఈ నవరాత్రి ఉత్సవాల్లో గణనా ధు డికి ప్రతిరోజు విశేష పూజలు నిర్వహించడం జరు గుతుంది అందులో భాగంగా ఆదివారం గణనాధునికి ఉదయం గణపతి పూజ సాయంత్రం శ్రీ లక్ష్మి కుబేర పూజలు నిర్వహించి గణనాధునికి రాత్రి దశ హారతులు ఇవ్వడం జరిగింది శ్రీ లక్ష్మి కుబేర పూజ సందర్భంగా గణనాధుని నీ కరెన్సీ నోట్లతో ప్రత్యే కంగా అలంకరించడం జరిగింది ఈ అలంకరణను చూసేందుకు భక్తులు ప్రజలు పోటీ పడడం జరిగింది పూజా కార్యక్రమాలలో మలిశెట్టి వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి గణనాధుని ఆశీస్సులు అందరికీ ఉండాలని కోరారు అనంతరం తీర్థప్రసాదాలు అందజేయడం జరిగింది ఈ పూజా కార్యక్రమాలలో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించడం జరిగింది రాత్రి సినీ పాటకచేరి మరియు వైజాగ్ మిమిక్రీ స్పెషల్ అప్పి రన్స్ తో డాన్స్ అండ్ మిమిక్రీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం భక్తులను ప్రజలను ఎంతగానో ఆకట్టుకోవడం జరిగింది

# గణేష్ నిమజ్జనంలో విషాదం
## పులి నాగలక్ష్మి దుర్మరణం
### గణేష్ నిమజ్జన ప్రాంతాలలో వసతులు శూన్యం



**కావలి, ఆగస్టు 31, ప్రభాతవార్త:** నిమజ్జనంలో విషాదం చోటు చేసుకుంది ఆదివారం కావలి వైకుంఠపురం పిజి సెంటర్ ప్రాంతానికి చెందిన గోవిందరాజు వాళ్ళమ్మ కుమార్తె పులి నాగ లక్ష్మి (16) అనే యువతి ప్రమాదవశాత్తు సముద్రంలో మునిగి పోవడం జరిగింది వెంటనే కావాలి ఏరియా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందడం జరిగిందని వైద్యులు నిర్ధారించడం జరిగింది. గణేష్ నిమర్జన తీర ప్రాంతాలలో వసతులు శూన్యం. గణేష్ నవరాత్రులు అయిన ఐదో రోజు ఆదివారం అయినందున గణనాథులు అధికంగా కావలి మండల సముద్రతీర ప్రాంతాలైన తుమ్మలపెంట, కొత్త సత్రం, చెన్నాయి పాలెం తదితర ప్రాంతాలకు నిమజ్జనం కోసం తరలి వెళ్లడం జరిగింది నిమజ్జనం చేసే ప్రాంతాలలో అధికారులు ఎటువంటి వసతులు సౌకర్యాలు కల్పించకపోవడంతో భక్తులు ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురికావాల్సి వచ్చింది రెవెన్యూ, పోలీస్, మెరైన్ పోలీస్, ఫిషరీఫ్, పంచాయితీ రాజ్ శాఖలు సమన్వయంతో వినాయకుని నిమజ్జనం జరిగే తీర ప్రాంతాలలో ప్రజలకు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా సముద్రం లోపలికి వెళ్ళనివ్వకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయవలసి ఉంటుంది కానీ ఎటువంటి ఏర్పాట్లు ఇక్కడ చేయలేదు భక్తులు సముద్రం లోపలికి వెళ్ళకుండా తాడుతో రూపులు ఏర్పాటు చేయాలి మెహరన్ పోలీసులు బోట్లు తదితర సామాగ్రిని సిద్ధం చేసుకుని ఎక్కడ ఎటువంటి ప్రమాదం జరిగిన అక్కడికి వెళ్లి ప్రమాదాలు జరగకుండాప్రజలను అప్రమత్తం చేయవలసి ఉంటుంది పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ నిమజ్జన ప్రాంతంలో లైట్లు ఏర్పాటు చేయాలి అలాంటివి లేకుండా ప్రజలు భక్తులు చిమ్మ చీకట్లలో ఎవరు వెళ్తున్నారు అర్థం కాక ధ్యానమైన స్థితిలో ఉండడం జరిగింది రెవెన్యూ శాఖ సంబంధిత శాఖలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ నిమర్జనం ప్రదేశాల్లో ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయవలసి ఉన్న ఇటువంటి సౌకర్యాలు వసతులు లేక భక్తులు ఎంతగానో ఇబ్బందులకు గురికావడం జరిగింది ముందస్తు చర్యలు చేపట్టనందు వలన ప్రమాదవ శాత్తు పులి లక్ష్మి వసతులు చేపట్టినందువలన ఇంకా ఎంతమంది మృతి చెందుతారో వేచి చూడవలసిన పరిస్థితి ఉంది ఇలాంటి దారుణమైన పరిస్థితిని గతంలో ఎప్పుడు చూడలేదని ప్రజలు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు



## సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**ఉదయగిరి, ఆగష్టు 31, ప్రభాతవార్త** ఉదయగిరి నియోజ కవర్గంలోని దుత్తలూరు మండలాన్ని మినహాయించి ఏడు మండలాలకు సంబంధించి 39 మంది బాధితులకు సుమారు 50 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పంపిణీచేశారు. వింజమూరులోని తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాల యం నందు ఆయా మండల నాయకులతో కలిసి ఆదివారం బాధితులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ వైద్యశాలలో వైద్యం చేయించుకొని ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా వైద్యం అందని వారికి సీఎం సహాయనిధి నుండి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా ప్రభుత్వం అందిస్తుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారు. మన ప్రభుత్వం మంచి ప్రభుత్వం అని ప్రభుత్వానికి అందరం అండగా ఉండాలన్నారు. ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం శ్రమిస్తున్నానని మీరందరూ తోడ్పాటును అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, సీహెచ్ బయన్న, మధు మోహన్‌రెడ్డి, బిజ్జం వెంకట కృష్ణారెడ్డి, వింజమూరు సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, మండల ఉపాధ్యక్షుడు ఆనంగి రమణయ్య, గువ్వల కృష్ణారెడ్డి, సీని యర్ నాయకులు పోలుబోయిన చంద్రబాబునాయుడు, యారవ కృష్ణయ్య, సర్పంచ్ పీవీ నాయుడు, బొల్లి నేని వెంకట రామారావు, మందాల శ్రీనివాసులు నాయుడు, కోడూరు నాగిరెడ్డి, గాలి రామ్మో హన్ నాయుడు, గాలి నర్సప్పనాయుడు, సీహెచ్ వసంతరావు, తిరుపతి ఆచారి, బొజ్జ నరసింహులు, నల్లిపోగు రాజా, ఏగినేని శ్రీనివాసులు నాయుడు తదితరులు ఉన్నారు.

# కోలాహలంగా లడ్డు వేలం



**కోవూరు , ఆగష్టు 31 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని టీఎన్‌సీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ విగ్రహం దగ్గర, అదేవిధంగా కొత్తూరు రోడ్డులోని గ్రామ పంచాయతీ వద్ద , శాంతినగర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద ఆదివారం లడ్డు వేలం పాటలు జోరుగా సాగాయి. కొంతమంది పోటీలు పడి ఈ లడ్డులు కైవసం చేసుకునేందుకు సమాయత్తం అయ్యారు. మొత్తం మీద వేలంపాటలో ఎక్కువ మొత్తం చేపట్టిన వేలందారునికి సంబంధిత వినాయక విగ్రహ నిర్వాహకులు లడ్డును అందజేశారు. లడ్డు కైవసం చేసుకున్న వారు ఆ ప్రాంతం నుంచి కోలాహలంగా బయలుదేరారు. అదేవి ధంగా మండలంలోని పలు ప్రాంతాల్లో బుధవారం వినాయక చవితి సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన విగ్రహాలు సాంప్రదాయబద్దంగా విద్యుద్దీపాల అలంకరణలో డీజే సిస్టమ్ మధ్య నిమజ్జనానికి బయ లుదేరాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంబంధిత పోలీస్ శాఖ ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేశారు. నాగసూరి ప్రవీణ్ 1,70,000కు అధిక మొత్తంలో పాడి లడ్డును కైవసం చేసుకున్నారు 25 సంవత్సరాల వార్షికోత్సవంలో ఈసారి లడ్డు వేలం ఇంత పెద్ద మొత్తంలో పోవడం పట్ల టిఎన్సి యూత్ సెంటర్ నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు



## వార్త విలేకరిని సత్కరించిన జిల్లా కలెక్టర్



**నెల్లూరు అగ్రికల్చర్, ఆగష్టు 31, ప్రభాతవార్త** రెవెన్యూ క్రీడల నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను, వార్త జాతీయ దినపత్రిక నెల్లూరు కలెక్టరేట్ రిపోర్టర్ షేక్ రిజ్వాన్‌ని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్‌లు ప్రశంసా పత్రం జ్ఞాపికలను అందజేసి ఘనంగా సత్కరించారు. శనివారం స్థానిక తిక్కన భవనంలో జరిగిన ఈ అభినందన కార్యక్రమంలో తెలుగుగంగ ప్రత్యేక కలెక్టర్, డీఆర్వో హుస్సేన్‌సాహెబ్, జిల్లా అధికారులు తదితరులుపాల్గొన్నారు. ఇదిజాతీయ దినపత్రిక వార్తాపత్రికకు, విలేకర్లకు, జిల్లా కలెక్టర్ ఓఆనంద్ ఇస్తున్న ప్రత్యేక గౌరవంగా వార్త దినపత్రిక యాజమాన్యం భావించింది.